


# ప్రతిన రోజు

-కె. సీ. చౌదరి

మజ్జిగ తిప్పడం పూర్తయింది. కానీ సుందరమ్మ రోజూలా ఒక్కసారి కూడా 'మా చిన్నికృష్ణుడే' పాట ఎత్తుకోలేదు. ఇల్లు తుడిచిన తరవాత నిలుచుంటూ నడుం పట్టుకుని, 'రామా రామా' అనుకోవడంకూడా వినిపించలేదు. సుందరమ్మగారు పొద్దున్న నుంచి మాటా మంతీ లేకుండా తన పనులు చేసుకు పోతున్నాది. స్వభావానికి విరుద్ధంగా ఎందు కలా మౌనం వహించిందో రమకి అర్థం కాలేదు.

అది ఆదివారం. శంకరంగారు షర్టు వేసుకుని చేతిలో ఫైలుతో ఆఫీసుకి బయలుదేరారు. 'అదేమిటండీ' ఆదివారం నాడుకూడా ఆఫీసే? ఈ ఒక్క రోజైనా ఇంట్లో ఉండకూడదూ? వెధవాఫీసు రోజూ ఉన్నదేగా' అని సుందరమ్మ అలవాటు ప్రకారం అడ్డు రాలేదు.

'రెండు రూపాయలుంటే ఇస్తారూ? కూరలు తెప్పించా'లని మాత్రం అడిగింది.

పైనుంచే జేబు తడుముకుంటూ 'దమ్మిడీకూడా లే'దని చెప్పి శంకరం గారు వీథిలో పడ్డారు.

మరో రోజైతే సుందరమ్మ అలా ఊరుకునే మనిషి కాదు. 'లేదంటే ఎలాగండీ—పిల్లలు వింటారా?' అంటూ గొడవ చేసేది. సుందరమ్మ పాపం, ఏం చేస్తుంది? రామానికి ఫర్వాలేదు. కాస్త అర్థం చేసుకోగలడు. కానీ కిట్టుగాడికి బోధపరచడం ఎవరి తరం? కూర వడ్డిస్తే కాని కంచం ముట్టుకోడు. కాళ్ళూ చేతులూ విసురుతూ ఏడుస్తూ దొర్లుతాడు. రమకూడా నిండు నెలలతో పుట్టింటికి వచ్చింది. కానీ గొడవ పెట్టినా లాభం ఏమీ ఉండేది కాదు. శంకరంగారు సుందరమ్మని కసురుతూ వెళ్లిపోవడం, ఆమె తన కర్మాన్ని తిట్టుకుంటూ గొణుక్కుంటూ పనిలో మునిగిపోవడం—అలాగ ముగిసేది ఆ గొడవ.

కాని సుందరమ్మ ఈ రోజు ఏ గొడవా పెట్టలేదు. కొద్ది నిమిషాలదాకా అలా రోడ్డు మలుపువేపు చూస్తూ నిలుచుండిపోయింది.

ష్కూలు లేకపోవడం వలన రామం,

కిట్ను ఇంట్లోనే గోల పెట్టి ఆడుకుంటున్నారు. కానీ సుందరమ్మ వాళ్లిద్దరినీ చదువుకోమని గదమాయించ లేదు; వీధిలో కెళ్లి ఆడుకోమనలేదు. ఆమె శరీరం తప్ప మనస్సు అక్కడ లేనే లేనట్లుంది.

గదిలో ఉన్న రమకి ఏమీ తోచడం లేదు. కూర్చుంటే బాధగా ఉంది; నిలుచుంటే మరీ కష్టంగా ఉంది. మంచంమీద సాగిలపడి బంధనాలన్నీ లూజు చేసుకుని పొట్టమీద నెమ్మదిగా నిమురుకోసాగింది. ఊఁహూఁ ఏం లాభం లేకపోయింది. ఆయాసంగా ఉంది. అర గంటనుంచి ఏ కదలికా లేదు.

ఏదో పనిమీద అటు వచ్చిన సుందరమ్మ రమని ఆ స్థితిలో చూసి గాభరాతో దగ్గిరగా వచ్చి, "ఏం అమ్మా, అలా బాధ పడుతున్నావు? నొప్పులొస్తున్నాయా' అని అడిగింది.

'కాదు. ఆయాసంగా ఉంది.'

'ఇంకా పదిహేను రోజులు పైనుంది కదూ?'

'ఊఁ.'

---

**బరువులూ, బాధ్యతలూ ఎక్కువైనప్పుడు మగవానిలో విసుపు, లేమి భయపెడుతూంటే ఇల్లాలిలో బాధా గూడుకట్టుకోవడం సహజం. ఇన్ని ఉన్నా కన్నవారి హృదయాలలో మమకారం చిగురిస్తూనే ఉంటుంది. అదే లేకపోతే సంతానం పెరగడం ఎలా? కొందరి ప్రేమ వినిపించే సంగీతం; మరి కొందరిది కనుపించని ఆప్యాయత!**

---

'కొంచెం హార్లిక్సు తాగుతావా?'

'హార్లిక్సూ వద్దు, ఏమీ వద్దు— ఆయాసంతో ఛస్తూ ఉంటే—'

సుందరమ్మ ఆ గదిలోకి ఎందుకు వచ్చిందో మరిచిపోయింది. ఎంత ప్రయత్నించినా గుర్తుకు రాలేదు. తన జ్ఞాపకశక్తిని తిట్టుకోసాగింది. ఇంతలో— 'అమ్మా...అమ్మా...చిన్నన్నయ్య వచ్చాడే!' అంటూ రాముం పరుగెట్టుకుని వచ్చి వార్త అందించి తుర్రుమని పారిపోయాడు. సుందరమ్మ తన లావుపాటి శరీరాన్ని ఈడుస్తూ గబగబా బయటకు వెళ్లింది.

జగం వచ్చి రమ ఎదుటనున్న కుక్కి మంచంలో కూలబడ్డాడు. మంచంలో పడుకున్న రెండేళ్ల పాప కదలాడింది.

'ఒరే జాగ్రత్త. . . పాప లేచి పోతుంది.' రమ హెచ్చరించింది.

'లేవనీ, నాతో ఆడుకుంటుందిలే.' జగం పాప తలమీద రాస్తూ అన్నాడు.

'బాబ్బాబు, దాన్ని ముట్టుకోకు. ఏడ్చి, ఏడ్చి ఇప్పుడే పడుకుంది.'

'కాఫీ తాగుతావురా, జగం? పొద్దున్న టిఫినూ గట్రా చేసేవా?' సుందరమ్మ అడిగింది.

'కాఫీ గీఫీ ఏం వద్దు. వంట్లైపోగానే అన్నం పెట్టేద్దువుగాని.' కుక్కిమంచం లోంచి కదలకుండా అన్నాడు జగం.

'దెయ్యంలా ఎలా తయారయ్యావు, బాబూ! లే, స్నానం చేద్దువుగాని.' సుందరమ్మ తువ్వాలు తీస్తూ అంది.

జగం అసలే నలుపు. ట్రెయిన్ ప్రయాణం చేసిరావడంతో మరీ భీకరంగా కనపడుతున్నాడు.

'చేస్తానుగా— అంత తొందరెందుకమ్మా!'

'ఒరే, నిన్ను చూడలేకపోతున్నాంరా. లే, ముందు స్నానం చేసి రా.' రమ బలవంతం చేసి లేవదీసింది.

తువ్వాలు భుజంమీద వేసుకుని, కూనిరాగాలు తీస్తూ స్నానానికి కదిలాడు జగం.

'నీవొస్తాడని నేను పొద్దుటినుంచీ అనుకుంటున్నాను. పొద్దుటి నుంచీ కాకి ఒకటే అరిచింది చూసేవా?' సుందరమ్మ ఇంత మొహం చేసుకుంటూ అంది.

కాకి ఎప్పుడు గోల పెట్టిందో రమకి గుర్తు లేదు. ఆ మాటకి వస్తే కాకులు అరవని రోజేది? రోజూ అరుస్తాయి. రమ మనస్సులో నవ్వుకుని ఊరుకుంది.

'రమా, ఈవేళ జగం పుట్టిన

మా ఖాతాదారులెల్లరకు ఉగాది శుభాకాంక్షలు

ఆడవాళ్ళను మగవాళ్ళను
అందరి నెంతో ఆకర్షించే
శంఖు మార్కు లుంగీలు

K.E.Md. ABOOBACKER
REGISTERED TRADE MARK
(கொ.இ.முகம்மது அபுபக்கர்)

శంఖు మార్కు
లుంగీలు తయారు చేయువారు
మొహమ్మద్ అబూబకర్ & కంపెనీ
95, తంబుచెట్టి వీధి, మదరాసు-1.

బ్రాంచీలు: మధురై ం క్విలాన్ ం కలకత్తా ం బొంబాయి

రోజా. తెలుసా?' సుందరమ్మ కంఠంలో ఒకటే ఉత్సాహం ధ్వనిస్తున్నాది.

రమకి ఆ సంగతి గుర్తు లేకపోయినా పొద్దుటినుంచీ సుందరమ్మ అన్యమనస్కగా ఉండడానికి కారణం మాత్రం తెలిసింది. 'అవునమ్మా, నాకు గుర్తు లేకపోయింది.'

'పిల్లలు పై ఊర్లో ఉంటే ఎంత ఇదో చూసేవా? పీడొస్తాడని ముందుగా తెలిస్తే కొత్త బట్టలు కుట్టించమనే దాన్నా మీ నాన్నని!'

'అవును మరి. పోనీలే. నువ్వు ఇప్పుడేం చేస్తావు? వస్తాడని ఎవరికి తెలుసు? ప్రతి ఏడాదీ కుట్టిస్తున్నానుగా?' అమ్మని ఎలా సముదాయించాలో రమకి అర్థం కాలేదు.

ఇంట్లో కూరలు లేవన్న సంగతి సుందరమ్మకు హఠాత్తుగా గుర్తుకు వచ్చింది. టైము చూస్తున్నట్లు గడియారం వేపు తల తిప్పి, 'రెండు రూపాయలుంటే ఇస్తావూ?' అంది రమతో.

'పెట్టెలో ఉన్నాయి తీసుకో.'

'నీ పెట్టె నేను ముట్టుకోను సుమా. నువ్వే తీసి ఇయ్యి.'

'అదేమిటమ్మా, అలాగంటావు! ముట్టుకుంటే అరిగిపోతుందా?' రమ కిదేం నచ్చదు. చాలా బాధగాకూడా ఉంటుంది. పెళ్లి కాగానే కూతురిని ఎవరో పైవాళ్లన్నట్లు చూడాలా? అలాగైతే కూతురుని ఇలా కాన్పులకు పిలవడం ఎందుకు, తీసుకురావడం ఎందుకు? అమ్మమీద చాలా కోపం వచ్చింది. కానీ అమ్మ రమ మాట వినాలేదు, పెట్టె ముట్టుకోనూ లేదు. రమే లేచి పెట్టెలోంచి రెండు రూపాయలు తీసి ఇయ్యవలసి వచ్చింది.

నోటు అందుకుంటూ సుందరమ్మ అంది: 'దీనితో ఇరవై రూపాయ లయ్యాయి. నాన్నగారి జీతం అందగానే ఇచ్చేస్తాను.'

రమ జవాబేం చెప్పలేదు. అమ్మ అలా మాట్లాడితే చాలా చిరాకు వేస్తుంది. తను పుట్టి పెరిగిన ఇంటికి తనెంత దూరమైపోయిందో అనిపించి చాలా బాధగా ఉంటుంది. కానీ అమ్మ కెలా బోధపరచడం? దానివల్ల మరింత అపార్థం చేసుకుంటుందే తప్ప లాభం ఉండదు. అలాంటప్పుడు మాట్లాడకుండా ఊరుకోవడమే ఉత్తమం.

జగం బాత్‌రూమ్‌నుంచి వచ్చి గుమ్మంలో నిలుచుని అటూ ఇటూ చూశాడు.

'బట్టలేమైనా తెచ్చుకున్నావురా?' రమ అడిగింది. జగం తల అడ్డంగా ఊపాడు లేదంటూ.

'నీ కెప్పుడూ ఇదే తెగులు. దర్జాగా చేతు లూపుకుంటూ వచ్చేస్తావు. రోజల్లా మాసిన బట్టలతో ఏడువు' అంటూనే ఇటూ అటూ చూసి 'అక్కడ నాన్నగారి లుంగీ ఉంటే తీసి మీదకు విసిరింది. 'కట్టుకుని ఏడువు.'

నిర్వికారంగా లుంగీ కట్టుకుని మళ్లీ ఆ కుక్కిమంచం మీద కూల బడ్డాడు. పాప ఏడుస్తూ లేచింది. జగం పిలవగానే ఏడుపు మాని వాని ఒడిలోకి వెళ్లిపోయింది. క్రిందటి సారి జగం వచ్చిన వారం రోజుల్లోను మామయ్యతో బాగా చనువైంది పాపకు. ఇప్పుడు మీదకు ఎక్కి జుట్టు పీకుతూ ఆడు కుంటున్నాది.

పాపనే చూస్తున్న జగం అన్నాడు: 'చూడక్కా! పాప ముక్కు అచ్చు వాణిశ్రీ ముక్కులాగే ఉంది.'

రమ నవ్వి ఊరుకుంది.

'అయితే, అక్కా, నువ్వు "లవ్ ఇన్ టోకియో" చూశావు కదూ?'

రమ అడ్డంగా తల ఊపింది లేదన్నట్లు.

'అరెరే... గ్రాండ్ పిక్చరక్కా ... ఎంత మంచి సీనరీ లున్నాయనుకున్నావు? ... పిక్చరు చూశావా, జపాను పూర్తిగా చూసినట్టే.'

రమ ఏమీ మాట్లాడలేదు.

'మహమూద్‌గాడు ఎంత బాగా ఆక్షను చేశాడనుకున్నావు? ఓ సీన్లో జపానీ అమ్మాయి దుస్తులతో వస్తాడు. బలే గమ్మత్తుగా ఉంటుంది. వాడిని చూస్తూ ఉంటే నవ్వి నవ్వి పొట్ట చెక్కలవుతుందంటే నమ్ము.'


రమకి చిరాకేసింది. సినిమా కబుర్లలో పడితే జగానికి మరి ఒంటిమీద స్పృహ ఉండదు. మైమరిచిపోతాడు. ఎంతకీ వదలడు.

'అవున్రా, నువ్వా ఊరు చదువుకుందికి వెళ్లేనా? లేక రోజా సినిమాలు చూడ్డానికా? ఇందుకేనా నిన్ను హాస్టల్లో ఉంచింది?'

రమ మరి ఊరుకోలేకపోయింది. ఊరుకుంటే కొద్ది సేపటిలో జగం మహమూద్ ఆక్షనుకూడా చేసి చూపించడం మొదలుపెడతాడు.

'ఒస్సి. . . నువ్వు మరీనక్కా. రోజా సినిమాలే చూస్తామా? అవునక్కా ఇప్పు డీ ఊర్లో ఏం పిక్చరు లాడుతున్నాయి?'

రమకి చాలా కోపం వచ్చింది. గట్టిగా ఏదో కసరబోయింది. ఇంతలో సుందరమ్మ గదిలోకి వచ్చి, 'వంటైపోయిందర్రా. మీ రందరూ ఇప్పుడే భోజనం చేసేస్తారా? నాన్నగారు వచ్చేదాకా ఉంటారా?' అని అడిగింది.




'తొందర లేదులే. నాన్నగారు రానీ, కలిసే తింటాం.' జగం అన్నాడు.

'నాన్నగారు రావడం చాలా ఆలస్యం కావచ్చు. మీ రందరూ అన్నాలు తినేయండి. నేనూ, అమ్మా ఉంటాం.' రమ తొందరపెట్టింది.

జగం, రామం, కిట్టు భోజనానికి కూర్చున్నారు. ఈ కొద్దిపాటి సమయం లోనే అమ్మ రెండు కూరలు, పప్పు, పులుసు, పరమాన్నం వండిన సంగతి రమ గమనించింది.

మరికొంచెం తినమని అమ్మ జగాన్ని బలవంతం పెడుతున్నాది. జగం వద్దు వద్దని గోల పెడుతున్నాడు. హాస్టల్ తిండి తిని జగం ఆరు మాసాల్లోనే చాలా చిక్కిపోయాడు. మొదట్లో జగం హాస్టల్ తిండి తినలేకపోతున్నానని, ఎప్పుడూ అమ్మ కళ్లలో మెదులుతున్నా దని ఉత్తరాలు రాసేవాడు. ఆ ఉత్తరాలు చదివి సుందరమ్మ కొంగుతో కళ్లు వత్తుకుంటూ అనేది: 'పాపం, పసివాడు! అమ్మా, నాన్నని వదిలి ఎప్పుడూ బయట ఉండలేదు. ఎలాగున్నాడో... ఏమిటో...'

ఆ పసివాడు అమ్మమీద ఎగురుతున్నాడు. 'అబ్బా, నా ప్రాణాలు తీయకు. నాకు పరవాన్నం సయించదని ఎన్ని సార్లు చెప్పాలి?'

'నేను నీ ప్రాణాలు తీస్తున్నానురా? నీ పుట్టిన రోజని ఈ వేళ పరవాన్నం చేశాను. నువ్వు ముట్టుకోకపోతే నా కెలాగుంటుంది, చెప్పు? అమ్మా, నాన్నా ఉన్నంత కాలం అలాగే ప్రాణాలు తీస్తున్నట్టు అనిపిస్తుంది. మేం కళ్లు మూస్తే గాని మీకు అర్థం కాదు.'

అర్థంలేని గొణుగుడు రమకి చిరాకేసింది.

జగం గదిలోకి వచ్చి ముఖం తుడుచుకుంటూ రమతో— 'అమ్మ మరీనూ. నాకు తీపి సయించదంటే వినదు' అంటూ రమ కెదురుగా మంచంమీద కూర్చున్నాడు.

'అమ్మ మనసు తెలుసుకొదా— అలా మాట్లాడి కష్టపెట్టవచ్చునా?' రమ జగం ముఖంవంక సూటిగా చూస్తూ అన్నాది. జగం ఈ మధ్య గెడ్డం గీయడం మొదలుపెట్టినట్టున్నది.

శంకరంగారు వచ్చేసరికి మూడు గంటలైంది. ఆయన కోసం చాలా సేపుదాకా చూసి చూసి మరి ఉండలేక రమ భోజనం చేసేసింది. సుందరమ్మ మాత్రం ఎదురుచూస్తూ కూర్చుంది.

శంకరంగారు వేలాడిపోతున్నట్లు నడుస్తూ వచ్చారు. బాగా అలిసిపోయినట్లు కనిపించారు. మూలుగుతూ చొక్కా విప్పి మేకుకి తగిలించి తన గదిలో మంచంమీద చేరగిలపడ్డారు.

'చాలా ఆలస్యమైపోయిందండీ' సుందరమ్మ అంది.

'ఊఁ.' శంకరంగారు మూలిగారు.

'భోజనం చేసేస్తారా?'

'వడ్డించు. వస్తున్నాను.'

శంకరంగారు చాలా నీరసంగా కూర్చున్నారు. గవర్నమెంటు సర్వీసులో ఉంటే ఈ పాటికి ఎప్పుడో రిటైరై ఉండేవారు. ప్రైవేటు కంపెనీ గనక తర్వాలేకపోయింది. అయిదేళ్ల క్రితందాకా 'కొద్ది రోజులేగా ఇంక పని చెయ్యడం' అనేవారు.

కొద్ది రోజులంటే శంకరం గారి తాత్పర్యం రమని ఓ ఇల్లాలుగా చేయడం, పెద్దబ్బాయి సత్యం ఉద్యోగం సంపాదించడం.

రమ పెళ్లి జరిగి నాలుగేళ్లు గడిచిపోయాయి. మూడేళ్ల క్రితం సత్యం ఉద్యోగంలో చేరాడు. కానీ, శంకరంగారు అనుకున్నట్లు రిటైరై దర్జాగా కాళ్ళు

మీద కాలు వేసుకుని కూర్చోలేక పోయారు.

సత్యం అతి కష్టంమీద బడిపంతులు ఉద్యోగం సంపాదించగలిగాడు. నెలకి వచ్చే వంద రూపాయలూ తనకి, పెళ్ళాం పిల్లలకే సరిపోవడం లేదు. నెలకి కనీసం పదో పదిహేనోకూడా పంపలేని స్థితిలో ఉన్నాడు. శంకరంగారికి పని చేయడం తప్పలేదు.

ప్రస్తుతం జగంమీద ఆశలన్నీ పెట్టుకున్నారు. సత్యానికి ఆర్ట్సు చదివించడమే పొరపాటైంది. బి. ఎ. డిగ్రీ ఉంటే ఏమిటి, లేకపోతే ఏమిటి? ఏ గవర్నమెంటు ఆఫీసులోనైనా గుమాస్తా ఉద్యోగంకన్నా పెద్దది ఏదీ దొరకదు. అందుకే జగాన్ని పై ఊర్లో హాస్టలులో పెట్టి సైన్సు చదివిస్తున్నారు. డాక్టరు, ఇంజనీరు కాకపోతే మానె. కనీసం కెమిస్టైనా అవుతాడని ఆశ.

శంకరంగారు తల దించుకుని భోజనం చేయసాగారు. ఏ ఆలోచనల్లో మునిగి ఉన్నారో రమకి, సుందరమ్మకికూడా అర్థం కాలేదు. విస్తరిలో వడ్డించిన వంటకంలోని ప్రత్యేకతనుకూడా గమనించలేదు శంకరంగారు.

భోజనం పూర్తికాగానే తన గదిలోకి వచ్చి ఆఫీసునుంచి తెచ్చుకున్న ఫైళ్ళు తెరుచుకుని పనిలో నిమగ్నులయ్యారు.

'ఇప్పటిదాకా ఆఫీసులో పని చేసుకొచ్చారు కదా— మళ్ళీ ఫైళ్ళుకూడా తెచ్చారా? కొంచెం విశ్రాంతి తీసుకోండి!' తాంబూలం అందిస్తూ సుందరమ్మ అంది.

'ఈ రోజే ఈ స్టేట్‌మెంట్ పూర్తి చెయ్యాలి. రేపు ఉదయం టపాలో హెడ్డాఫీసుకి పంపాలి.' శంకరంగారు తన పనిలో మునిగిపోయారు.

'రాత్రీ, పగలూ పనేనా?'

శంకరంగారు జవాబివ్వలేదు.

'జగం వచ్చాడు.'

'ఓహో... కాలేజీకి సెలవు లిచ్చారా?' అన్నారు శంకరంగారు వ్రాసుకుంటూ తల ఎత్తకుండానే.

'ఈవేళ ఆదివారం కదండీ? సాయంకాలానికి వెళ్ళిపోవాలంటున్నాడు. . . రేపటిదాకా ఆగమన్నాను. రేపు సాయంత్రానికి వెళ్ళిపోవచ్చును.'

శంకరంగారు వినిపించుకోలేనట్లుంది.

'వాడు కొంచెం డబ్బు కావాలంటున్నాడండీ. సైన్సు రికార్డ్సు, టూత్‌బ్రష్, ఇంకా ఏవో చిల్లర సామాన్లు కొనుక్కోవాలిట. పాపం. . . చెప్పులుకూడా తెగిపోయాయి. చూడండి, పాతికో, ముప్ఫయ్యో. . .'

శంకరంగారు మెల్లిగా తల ఎత్తి హఠాత్తుగా అరిచారు. 'ఎక్కడిదీ? మా తాతగారేమైనా దాచి ఉంచేరా? మాట మాటకీ ఆ వెధవ డబ్బు కోసం వచ్చేస్తుంటాడు!'

'మీరు మరీనండీ. . . డబ్బు కావాలంటే మీ దగ్గరకు రాకపోతే మరెక్కడికి వస్తాడు?'

'నెల నెలా వంద రూపాయలు పంపుతున్నాను. వాటితో సర్దుకోలేకపోతే పొమ్మను. అసలు వాణ్ణి రమ్మన్నది ఎవరు? ఏదైనా కావలసివస్తే ఓ కార్డుముక్క రాయకూడదా? రెండు రూపాయలు ఖర్చుపెట్టి రావాలా? ఇక్కడేవో బాబుగాడి సొమ్ము దాచి ఉంచేననుకుంటున్నాడా? చదువుకుంటున్నవాళ్ళెవరైనా ఇలా కుక్కలా తిరుగుతారా?'

'కోపం వస్తే మీకు మంచీ చెడ్డా ఉండదండీ. పాపం, పుట్టిన రోజని వాడొచ్చాడు.'

'పుట్టినరోజుట. పుట్టి వెధవలు ఉద్ధరిస్తున్నారు. పుట్టినరోజైతే చదువు ఎగ్గొట్టి రావాలా? బుర్రా బుద్ధీ లేకపోతే సరి. రేపటిదాకా ఇక్కడెందుకు పడుండాలి? ఈవేళే పొమ్మను!'

పక్క గదిలో రమ దగ్గర కూర్చున్న జగం జోళ్ళు వేసుకుంటూ కన్ను గీటి అన్నాడు: 'అమ్మ బాబోయ్. . . వాతావరణం ఏం బాగులేదు.'

'ఒరే, జగం, ఇన్ని తిట్లు తిన్నా నీకు సిగ్గులేదురా! ఎలా నవ్వగలుగుతున్నావురా?'

జగం ఏమీ జవాబు చెప్పలేదు. క్రాపు దువ్వుకుంటూ అద్దంలో తన ముఖాన్ని వివిధ కోణాలనుంచి చూడసాగాడు.

'నీ దగ్గర ఏమైనా ఉందిరా?'

జగం జేబులు దులిపి చూపించాడు లేదన్నట్లు.

'ఇదుంచుకో. సరిపోతాయా? వచ్చే నెల నీకు జోళ్ళు కొనిపెడతాను.' రమ పది రూపాయల నోటు అందించింది.

'ఉంటే మరో రెండియ్యి, మా ఊర్లో "తాసిల్దారుగారి అమ్మాయి"ఆడుతున్నాదక్కా. మాంచి పిక్చరు. శోభన బాబు డబుల్ రోల్.'

'నీ కీ జన్మలో బుద్ధి వస్తుందిరా? ఇన్ని చీవాట్లు తిని. . .'

'కావాలంటే నువ్వుకూడా చీవాట్లు పెట్టక్కా, ఫర్వాలేదు, దులిపేసుకుంటాను. కానీ, రెండు రూపాయ లిటు పారేయ్. . .'

రమ అతి కష్టంమీద నవ్వాపుకుంది. 'ఒరే, జగం, ఈ రోజుకి నీకు పద్దెనిమిదేళ్ళు నిండాయి. కుర్రతనం వదిలిపెట్టు. పెద్దవాడి వయ్యావని గుర్తుంచుకో. నాన్నగారు ఎంత కష్టపడి మిమ్మల్ని పోషిస్తున్నారో తెలుసా? నీ ఒక్కడిమీద వంద రూపాయలు ఖర్చు పెడుతున్నారు. తక్కిన రెండు వందలుతో మిగిలిన వాళ్ళందరూ ఎలా సర్దుకుంటున్నారో ఆలోచించు. ఈ కరువురోజుల్లో ఎలా గడుపుతున్నారో ఎప్పుడైనా ఆలోచించావా?'

అక్క ఇస్తున్న రెండు రూపాయల నోటు లాక్కుంటూ, 'సరే. . . సరే' అన్నాడు జగం.

. చప్పుడు చేయకుండా పెరటిదారి నుంచి బ్రెయిన్ అందుకోవడానికి దారి తీశాడు జగం. చిన్నతనంలో రమకూడా ఆ పెరటిదారినుంచే అమ్మా, నాన్నకి తెలియకుండా ఆడుకోవడానికి పారిపోయేది.

పొద్దు దిగజారుతున్నాది. నాలుగు పక్కలి చీకట్లు ముసురుకోవడం ప్రారంభించాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నాది. రాముం, కిట్టు పుస్తకాలు తెరిచి చదువుతున్నారు. చదువుతున్నట్లు నటిస్తున్నారు.

రమ తన గదిలోంచి బయటకు వచ్చింది. సుందరమ్మ పాత బట్టలు పోగుచేసి బొంతలు కూరుస్తూ కూర్చున్నాది. కళ్ళు, ముక్కు ఎర్రగా ఉండి చాలాసేపు ఏడ్చినట్లు గుర్తు చెపుతున్నట్లుంది.

శంకరంగారు దుప్పటీ ముసుగు వేసుకుని తన గదిలో పడుకున్నారు. రమ రావడం గ్రహించి, 'జగం వెళ్ళిపోయేడా' అని అడిగారు ముసుగు తీసి.

'ఊఁ. . .'

'టికెట్టుకి డబ్బులున్నాయా వాడి దగ్గర?'

'ఊఁ. . . ఉన్నాయి.'

రమ అక్కడనుండి కదలడంతో శంకరంగారు మళ్ళీ ముఖంమీద దుప్పటీ ముసుగు వేసుకున్నారు. *

---

వచ్చే వారం నుంచి

# చిత్రాలలో లేపాక్షి

భద్రాచలం, విజయవాడ కళానిక్షేపాలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు అందించిన ప్రసిద్ధ చిత్రకారుడు 'శిల్పి' లేపాక్షిలోని అపూర్వ శిల్పసంపదను అతి నిపుణంగా చిత్రీకరించారు.

వచ్చే వారం నుంచి ఈ చిత్రాలు ధారావాహికంగా వెలువడగలవని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

—ఎడిటర్

---



ప్రమిద - ప్రమద